క్లుప్తంగా

బుడంపాడు సొసైటీ చైర్మన్ రాజీనామా



గుంటూరు రూరల్: మండలంలోని బుడంపాడు గ్రామంలోని కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ ఏటుకూరు గ్రామానికి చెందిన ద్రాక్షారం మీరజ్‌కుమార్ తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. శుక్రవారం ఏటుకూరులోని తన నివాసం నుంచి సొసైటీ సెక్రటరీకి తన రాజీనామా పత్రాన్ని పంపినట్లు తెలిపారు. మీరజ్ గత ఏడాది జనవరిలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. పదవీకాలం మరో మూడు నెలలు ఉండగానే రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు.

ఆర్‌టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఆర్‌టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హౌసింగ్‌బోర్డ్ కాలనీకి చెందిన షేక్ ఫరీద్ అబ్దుల్లా తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా నల్లకుంట వద్ద మితిమీరిన వేగంతో వెనుక నుంచి వచ్చిన ఆర్‌టీసీ బస్సు ఢీకొంది. దీంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా, వైద్యులు చికిత్స అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తోకావారిపాలెంలో ఇరువర్గాలపై కేసు నమోదు

గుంటూరు రూరల్: మండలంలోని తోకావారిపాలెం గ్రామంలో అధికార పార్టీ కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఇరు పార్టీలు గొడవ పడినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ సర్పంచి ఇంటిపై దాడి సంఘటనలో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. దీంతోపాటు మరో వర్గం వారిపైనా బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు.

సాంకేతికతను అందిపుచ్చుకోండి

తెనాలిఅర్బన్: సాంకేతికతను అందిపుచ్చుకోవాలని తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చిన్న వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. చిన రావూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను కూడా డెవలప్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న విద్య విధానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం జరిగిన జాబ్ మేళాలో 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 64 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా టెక్స్‌టైల్స్ అసోసియేషన్ చైర్మన్ పి.కోటేశ్వరరావు, కార్యదర్శి యుఎం కుమార్, జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రమాదేవి, బాపట్ల జిల్లా ఐటీఐ కన్వీనర్ ఎస్.సుధాకర్‌బాబు, మాచర్ల ప్రభుత్వ ఐటీఐ ట్రైనింగ్ ఆఫీసర్ సీహెచ్. రవి, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



పెదకాకానిలో సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచి గోళ్ళ స్వరూపారాణి, తదితరులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గేరా మోహనరావు తదితరులు

- గ్రంథాలయంలో ముగిసిన సమ్మర్ క్యాంప్
- పలు పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

పెదకాకాని: గ్రంథాలయాలు దేవాలయాలతో సమానమని, ప్రతి ఒక్కరు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రామ సర్పంచి గోళ్ళ స్వరూపారాణి అన్నారు. పెదకాకాని లూథర్‌గిరికాలనీ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఈ సమావేశానికి గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచి గోళ్ళ స్వరూపారాణి మాట్లాడుతూ ప్రతి రోజూ పుస్తకాలు, వార్తా పత్రికలు చదవడం వల్ల పఠనాసక్తితోపాటు విజ్ఞానం కూడా పెరుగుతుందని తెలిపారు. గుంటూరు జిల్లా జన విజ్ఞాన వేదిక ప్రతినిధి వల్లభపురపు ప్రసాద్ మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంపు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడిందన్నారు. ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవడానికి వేదికగా ఈ క్యాంపు ఉన్నందుకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిని విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడం ఈ సమ్మర్ క్యాంపు ముఖ్య ఉద్దేశమన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గోపాలరావు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ, సర్వేపల్లి రాధాకృష్ణ, అబ్దుల్ కలాం వంటి మహనీయుల జీవిత చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. వారి బాటలో నడిచి జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. సబ్ రిజిస్ట్రార్ బంగారుకుమార్ మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల ప్రయోజనాలను వివరించారు. కేవలం పాఠ్య పుస్తకాలే కాకుండా గ్రంథాలయంలో ఉన్న వాటిని కూడా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. తద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. సమ్మర్ క్యాంప్ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బెంగళూరు సైంటిస్ట్ వల్లభపురపు సౌమ్య, ఉపాధ్యాయురాలు వేముల మేరీ ప్రమీల, రీసోర్స్ పర్సన్ గోళ్ళ వెన్నెల, విద్యార్థులు పాల్గొన్నారు.

కాకుమాను: పుస్తక పఠనంతో మానసిక ఉల్లాసంతోపాటు విషయ అవగాహన పెంపొందుతుందని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. పెదనందిపాడు మండలం శాఖా గ్రంథాలయంలో గత నెల 15వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. చివరి రోజు విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు, క్విజ్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి పి.సుభాషిణి, విశ్రాంత ఉపాధ్యాయులు సాయిబాబు, కృష్ణారావు, రాజబాబు, గేరా మంజుల, మద్దిరాల బుజ్జి, గేరా రామస్వామి, ఆనందరావు, సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథక లక్ష్యం నెరవేర్చాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ కూలీలను సీపీఐ అనుబంధ మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి కలసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. 100 రోజుల పని కల్పించి రోజుకు రూ.300 ఇవ్వాలనే ఈ పథక లక్ష్యం నెరవేరడం లేదని ఆరోపించారు. ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావడంలో వామపక్షాల పాత్ర కీలకమని గుర్తుచేశారు. ఈ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయటానికి ప్రయత్నిస్తోందని తెలిపారు. అక్టోబర్‌లో గ్రామ సభలు నిర్వహించి పనులు గుర్తించాలని, ప్రతి కుటుంబానికి వంద రోజుల ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం కంటే ఈ ఏడాది బడ్జెట్ తగ్గించిందని, ఉపాధి తగ్గి నిరుద్యోగులందరూ ఈ పనులకు వస్తున్నారని పేర్కొన్నారు. అందరికీ వంద రోజులు పనులు కల్పించాలంటే కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎల్ అరుణ, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు జెట్టి బాలరాజు, ప్రతినిధులు కె. జైపాల్, జి. కమల, అనూష, అశోక్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత కలిగిన కమ్యూనిస్ట్ ఉద్యమకారుడు శివరామకృష్ణ

సీపీఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్



తెనాలిఅర్బన్: నిబద్ధత కలిగిన కమ్యూనిస్ట్ ఉద్యమకారుడు బొల్లిముంత శివరామకృష్ణ అని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ కొనియాడారు. శివరామకృష్ణ 20వ వర్ధంతిని గాంధీ నగర్‌లోని సీపీఎం తెనాలి నియోజక వర్గ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ఆయన అనేక రచనలు చేశారని గుర్తుచేశారు. సినీ రచయితగా అనేక స్ఫూర్తిదాయక చిత్రాలను రచించారని చెప్పారు. ఆయన రచించిన అనేక చిత్రాలు సంచనాలు సృష్టించాయని, రచనలకు ప్రభుత్వం అనేక అవార్డులు అందించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బొల్లిముంత కృష్ణ, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు గురుబ్రహ్మం, పార్టీ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, పార్టీ పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు, ఎం.రామలింగేశ్వరరావు, ఆకుల శ్రీనివాస్, డి.బాల చైతన్య, బిళ్ళ రాజేష్, గండు శివ, బషీర్, మునిపల్లి వంశీ, పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా పాఠ్యపుస్తకాలు



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న పాఠశాలల విద్యార్థులకు అందజేసేందుకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు సిద్ధంగా ఉన్నట్లు ఎంఈవో మహబూబ్ సుబాని శుక్రవారం తెలిపారు. మండలంలో మొత్తం 57 పాఠశాలలు ఉన్నట్లు గుర్తుచేశారు. వాటిలో 3 అప్పర్ ప్రైమరీ, 6 జిల్లా పరిషత్, 3 ఎయిడెడ్, 3 ఎయిడెడ్ ప్రైమరీ, 42 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయని చెప్పారు. ఇప్పటివరకు 1- 7వ తరగతి విద్యార్థులకు 12,886 పాఠ్యపుస్తకాలు వచ్చాయని తెలిపారు. 8వ తరగతి వారికి 4,960, తొమ్మిదో తరగతి విద్యార్థులకు 6,188, 10వ తరగతి వారికి 5,093 పాఠ్యపుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. 6-10వ తరగతి విద్యార్థులకు 26,118 నోట్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని సెయింట్‌పాల్స్ స్కూలులోని స్టాక్ పాయింట్‌లో భద్రపరిచినట్లు తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలలు తెరిచిన తర్వాత వాటిని పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

దశావతార వేంకటేశ్వరస్వామి సన్నిధిలో నారా భువనేశ్వరి



పూజా కార్యక్రమాల్లో నారా భువనేశ్వరి, బ్రాహ్మణిలకు వేద ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

పెదకాకాని: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణిలు శుక్రవారం దశావతార వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరు ఐజేఎం వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి రావడంతో ఆలయ నిర్వాహకులు లింగమనేని పూర్ణభాస్కరరావు దంపతులు నారా భువనేశ్వరి, బ్రాహ్మణిలకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అర్చకస్వాములు గోత్రనామ పూజలు చేశారు. అనంతరం వేద ఆశీర్వచనం చేశారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న నారా భువనేశ్వరి, బ్రాహ్మణిలతో పాటు గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి శ్రీరత్న తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



దుర్గాసదనంలో శివకరణ్ సింగ్‌కు స్వాగతం పలుకుతున్న స్థానికులు

పెదకాకాని: స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివకరణ్ అన్నారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా 2022 మార్చి 25న ఉత్తరప్రదేశ్‌కు చెందిన జాతీయ ప్రచారకుడు శివకరణ్ సింగ్ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఒంటరిగా పాదరక్షలు లేకుండా యాత్రకు బయలుదేరారు. ఈ పాదయాత్ర శుక్రవారం గుంటూరు జిల్లా పెదకాకాని శివాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీ మహాదేవ హిందూ ధర్మ పరిరక్షణ సేవా సంస్థ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. తర్వాత శివకరణ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. ముందుగా స్వాతంత్ర్య సమరయోధుల పేరిట దుర్గాసదనంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మపరిరక్షణ సేవా సంస్థ సభ్యులు చింతా శంభునాథ్, మాధవ్, కడియాల గోపి, బొల్లారెడ్డి, కాశీ విశ్వనాథ శర్మ ,సాయి ప్రసాద్, రవి, అంకబాబు పాల్గొన్నారు.

అలరించిన ప్రహ్లాద పట్టాభిషేకం



రంగనాయకికి సత్కారం

నగరంపాలెం: ప్రముఖ హరికథా భాగవతులు, సువర్ణ హస్త కంకణ గ్రహీతలు ఖజానా విశ్వరూపాచారి 12వ సంస్మరణ సభను బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళా వేదికపై శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య, తుర్లపాటి శంభయ్యాచార్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుప్పావై కోయిల కోగంటి రంగనాయకిని ఘనంగా సత్కరించారు. అనంతరం విశ్వరూపాచారి మనవరాలు కుమారి తాళ్లూరి ధరణి ప్రహ్లాద పట్టాభిషేకం, కలింగ నర్తన తిల్లాన ప్రేక్షకుల్ని రసానందంలో ఓలలాడించాయి. మరొక మనవరాలు దివ్యసాయి సుందరకాండ హరికథ శ్రోతల్ని ఆనందానుభూతుల్లో తేలియాడించింది. కార్యక్రమాల్ని నాట్యాచార్య డాక్టర్ కాజ వెంకటసుబ్రహ్మణ్యం, విశ్వరూపాచారి కుటుంబ సభ్యులు పర్యవేక్షించారు.

ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర జనరల్ సెక్రటరీగా ప్రకాష్



బుల్లా రాజారావు నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న ముదిగొండ ప్రకాష్

తాడేపల్లి రూరల్ : ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర జనరల్ సెక్రటరీగా తాడేపల్లికి చెందిన ముదిగొండ ప్రకాష్ నియమితులయ్యారు. శుక్రవారం తాడేపల్లి మునిసిపల్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట మండలి అధ్యక్షులు బుల్లా రాజారావు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముదిగొండ ప్రకాష్ మాట్లాడుతూ తనకు ఈ పదవి ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి మణికుమార్, కొల్లి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

204 మందికి వైద్యపరీక్షలు



ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. 204 మందికి వైద్యురాలు పి. ఎస్తేరురాణి వివిధ రకాల పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీ సాగరరాణి, ఏఎన్ఎం సరోజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి నగదు అందజేత

ఫిరంగిపురం: మండలంలోని కండ్రిక గ్రామంలో పాల ఉత్పత్తిదారుల సహాయ సంఘంలో కార్యదర్శిగా పనిచేసే జి.రామారావు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడి కుటుంబ సభ్యులకు శుక్రవారం సంఘం సహాయనిధి కింద రూ.1,44,649 నగదును మేనేజర్ టి. వీరేంద్రకుమార్, కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు ఎ.రమణయ్యలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు టి. కృష్ణ, రూట్ సూపర్‌వైజర్లు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

రైతన్నా జాగ్రత్త.. నకిలీ విత్తనాలుంటాయ్

- ఏటా పలుచోట్ల మోసపోతున్న అన్నదాతలు
- అనుమతులున్న వాటినే కొనుగోలు చేయాలి
- బిల్లు వంటివి భద్రపరిస్తే పరిహారం కూడా పొందొచ్చు
- అవగాహన పెంచుకుంటే ఆర్థికంగా ఎంతో మేలు

ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న అన్నదాతలు నకిలీ విత్తనాల విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. ఏటా ఏదో ఒక చోట ఇలాంటి నకిలీ విత్తనాల వల్ల పలువురు నష్టపోతున్నారు. కాస్త అవగాహన పెంచుకుని అప్రమత్తంగా వ్యవహరిస్తే ముందు నకిలీ విత్తనాల బారిన పడకుండా ఉండొచ్చు. ఒకవేళ నష్టపోయినా తగిన రీతిలో వ్యవసాయ శాఖాధికారులను సంప్రదిస్తే పరిహారం కూడా పొందేందుకు వీలుంటుంది.



పొలం దున్నుతున్న రైతు



నకిలీ విత్తనాలు కొని నష్టపోయిన రైతు ఖాదర్ బాషా (ఫైల్)

తాడేపల్లి రూరల్: రుతుపవనాల సమయం ఆసన్నమైంది. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో రైతులు ఖరీఫ్ కోసం పొలాలకు ఎరువులు తోలడం, దుక్కులు దున్నడం ప్రారంభించారు. వాతావరణం పూర్తిస్థాయిలో అనుకూలిస్తే నెల రోజుల్లో రైతులు విత్తనాలు జల్లే పనులు చేపట్టనున్నారు. మంగళగిరి నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వరి పంటే ఎక్కువగా సాగు చేస్తుంటారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే ఈ ఏడాది వరి విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఆ శాఖ ద్వారా అందించే రాయితీ విత్తనాలే కాకుండా రైతులు ప్రైవేటు దుకాణాల్లో లభించే విత్తనాలపై కూడా ఆధారపడుతున్నారు. ఈ క్రమంలోనే కొందరు వ్యాపారులు తక్కువ ధరకే ఎక్కువ దిగుబడి ఇచ్చే విత్తనాలు తమ వద్ద లభిస్తాయంటూ రైతులను మభ్యపెడుతున్నారు. ఇలా ప్రచారం చేసిన ఓ విత్తనాల కంపెనీని నమ్మి దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామానికి చెందిన షేక్ ఖాదర్ బాషా తాను కౌలుకు తీసుకున్న రెండు ఎకరాలలో మొక్కజొన్న విత్తనాలు వేశారు. మొక్కజొన్న చేను ఏపుగా పెరిగింది. దానికి వచ్చిన పొత్తుల్లో మాత్రం కంకులు లేకపోవడంతో ప్రైవేటు విత్తనాల కంపెనీ మాట విని మోసపోయానని వ్యవసాయ శాఖ అధికారులకు మార్చిలో ఫిర్యాదు చేశారు. అధికారులు సైతం ఖాదర్ భాషా పంట పొలాన్ని పరిశీలించి, జరిగిన దానిపై లోతుగా పరిశీలించి చర్యలు తీసుకుంటున్నామని అప్పట్లో తెలిపారు. నెలలు గడుస్తున్నా రైతుకు ఎలాంటి నష్టపరిహారాన్ని కంపెనీ అందజేయలేదు. నకిలీ విత్తనాల బారిన పడి ఏటా అధిక సంఖ్యలో రైతులు నష్టపోతున్న నేపథ్యంలో కొనుగోలు సమయంలో తగిన సూచనలు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే నకిలీ విత్తనాలను ముందే గుర్తించొచ్చని, నష్టపోయినా పరిహారం సైతం పొందవచ్చని చెబుతున్నారు.

అన్నదాతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వ్యవసాయ శాఖ అనుమతి పొందిన దుకాణాల్లో మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. కొన్ని చోట్ల ప్రభుత్వం అనుమతి లేని అనధికార విత్తన వ్యాపారులు తెల్ల సంచుల్లో నకిలీ విత్తనాలను విక్రయించే అవకాశం ఉంది. వారి సమాచారాన్ని తక్షణమే అధికారులకు తెలియజేయాలి.
- ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థల నుంచే సర్టిఫైడ్ విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. బిల్లుపై రైతు చిరునామా, గడువు తేదీ, విత్తనాల ధర, కంపెనీ పేరు, అమ్మిన వారి సంతకం తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి.
- విత్తన బస్తాపై ముద్రించిన ధ్రువపత్ర బిల్లు తమ పంట చేతికి వచ్చే వరకూ రైతులు భద్రపరచుకోవాలి. విత్తనాలు కొన్న వెంటనే మొలక శాతం పరీక్షించుకోవాలి. కనీసం 75 శాతం మొలకలు ఉంటే వాటిని విత్తనంగా వినియోగించుకోవాలి. విత్తనం సంచులను రైతులు నమూనా వివరాల కోసం పంట కోతకు వచ్చే వరకు దాచుకోవాలి.

పరిహారం పొందడం సులువే

విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించాలి. ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన వ్యాపారుల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి. ఒకవేళ నకిలీ విత్తనాలతో మోసపోతే వెంటనే వ్యవసాయాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. విత్తనాలు నాణ్యమైనవి కాకపోవడం వల్లే దిగుబడి రాలేదని గుర్తిస్తే సదరు విత్తన కంపెనీపై మండల వ్యవసాయాధికారి ద్వారా జిల్లా వ్యవసాయ సంచాలకులకు ఫిర్యాదు చేసి పరిహారం పొందవచ్చు. దీనికోసం రైతులు కొనుగోలు బిల్లు వంటివి భద్రపరచుకోవాల్సి ఉంటుంది.

– శ్రీనివాసరావు, తాడేపల్లి వ్యవసాయ శాఖ అధికారి

శ్యాంప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పరిశోధకుడు ఎస్. శ్యామ్ ప్రసాద్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. కిరణ్మయి తెలిపారు. కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పరిశోధన పర్యవేక్షకులు డాక్టర్ కె. శారదాదేవి పర్యవేక్షణలో ' ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ త్రో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ ఇన్ తెలంగాణ ' అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినందుకు గాను శ్యామ్ ప్రసాద్‌కు వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని పేర్కొన్నారు.

గ్రంథాలయంలో ముగిసిన వేసవి శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి, బహుమతి అందజేశారు.

•రేపు కళాకారుల సంఘం సర్వసభ్య సమావేశం

తెనాలి: పట్టణ రంగస్థల కళాకారుల సంఘం సర్వసభ్య సమావేశం ఈ నెల 9న ఉదయం 10 గంటలకు బుర్రిపాలెం రోడ్డులోని బీసీ కాలనీలో ఉన్న కళాకారుల సంఘ భవనంలో జరుగుతుందని సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ సభ్యులంతా హాజరుకావాలని పేర్కొన్నారు.